
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 113 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృథు చరిత్ర -6

క్రితం వ్యాసంలో బ్రహ్మ వచ్చి పృధువుతో ఇంద్రుడిమీద బాణప్రయోగం చేయొద్దనీ అధర్మంగా ఇంద్రుడు చేసిన పనికి ఏదో కారణం ఉందనీ, అయినా యజ్ఞం దేవతలకోసం అనీ వారించాడని చదివాం. యజ్ఞం చేసి ఎవరిని ఆరాధిస్తున్నామో వాళ్లని వధించడం ఎలా కుదురుతుంది? యజ్ఞం చేయడం మన క్షేమం కోసం అని కదా. ఇదే విషయం మనం భగవద్గీతలో కృష్ణుడు చెప్పడం చూడవచ్చు.

అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః
యజ్ఞాద్భతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః (భవగద్గీత, కర్మ యోగం 3-14)

భూత ప్రపంచం బతకడానిక్కావాల్సిన ఆహారం (అన్నం) మేఘాలు/వర్షాలవల్ల కలుగుతోంది. ఆ వర్షాలు రావాలంటే యజ్ఞం చేయడం తప్పనిసరి ఎందుకంటే ఆ వర్షాలు కురిపించేది ఇంద్రుడు కదా. అయితే ఈ యజ్ఞం మాత్రం కర్మ వలనే సంభవిస్తుంది. ఇక్కడ యజ్ఞం అంటే కూడా ఏమిటో భగవద్గీతలో చెప్పాడు – యజ్ఞానాం జపయజ్ఞోస్మి (విభూతి యోగం 10.25) అంటూ. అందువల్ల మన పూర్వులు అయిన పృధు చక్రవర్తిలాగా అశ్వమేధం చేయక్కరలేదు కానీ జప యజ్ఞం లాంటివి చేయాలి ప్రపంచ శాంతి, సంక్షేమం కోసం. ఇందులో మరో విశేషం ఉంది. రాజులు, గొప్పవారు ఏం చేస్తారో మిగతావారు కూడా దాన్నే ఆచరిస్తారు కదా? ఇప్పుడు పృధువు ఇంద్రుడితో యుద్ధం చేసి అగ్నిలో ఆహుతి చేస్తే తానే అధర్మం చేసినట్టూ దాన్ని ఇతరులకి చేయమని సూచించినట్టూ అవదూ? చతుర్ముఖుడు చెప్పిన సంగతి ఇదే. కృష్ణుడు గీతలో చెపుతున్నాడు చూడండి తాను భగవంతుడు అయి ఉండీ ఏ పనీ చేయక్కరలేదు కానీ ఎందుకు కర్మ చేయాలో, దాన్ని తానెందుకు చేస్తున్నాడో వివరిస్తూ.

యద్యదాచరతి శ్రేష్ట స్తత్తదేవేతరో జనః
సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే (భవగద్గీత, కర్మ యోగం 3-21)

ప్రపంచంలో శ్రేష్టులైన వారు ఏమి చేస్తారో అదే మిగతా జనులు ఆచరిస్తారు. దానినే ప్రమాణంగా తీసుకుని మిగతావారు కూడా అనుసరించడానికి ప్రయత్నిస్తారు. ఇంతవరకూ వచ్చింది కనక ఈ యజ్ఞం ఇక్కడతో ఆపుచేసి ఇంద్రుడితో స్నేహం చేసుకో అని చెప్తున్నాడు.

వ. అని పలుకు సమయంబున యజ్ఞభోక్తయు యజ్ఞవిభుండును భగవంతుండును నైన సర్వేశ్వరుం డింద్ర సమేతుండై యచ్చటికిం జనుదెంచి యా పృథున కిట్లనియె. [4-538]

అలా పృథు చక్రవర్తి చేయబోయిన నూరో యాగం బ్రహ్మ వచ్చి ఆపించేసరికి భగవంతుడు వచ్చాడు కరుణించడానికి, కూడా ఇంద్రుణ్ణి కలుపుకుని. ఇద్దరికీ సఖ్యం కుదిర్చాక ఏమైంది?

మ. భగవంతుండును విశ్వరూపకుఁడునై భాసిల్లు నవ్విష్ణుఁ డా
జగతీనాథకృతార్చనా నతులచే సంప్రీత చేతస్కుఁడున్
నిగృహీతాంఘ్రి సరోరుహద్వయుఁడునై నిల్చెం బ్రయాణాభిము
ఖ్యగరిష్ఠాత్మకుఁ డయ్యె నా పృథునిపైఁ గారుణ్య మేపారఁగన్. [4-547]

ఇలా వచ్చిన భగవంతుడి కి చేసిన అర్చన స్తోత్రాలకి సంప్రీతుడయ్యాడు. అలా క్షమించగానే విష్ణువు చెప్పాడు నువ్వు ధర్మం తప్పకుండా ఇలాగే పరిపాలన చేస్తే త్వరలోనే సనక సనందనాదులు నీ ఇంటికి వస్తారు, నువ్వు మోక్షం పొందుతావు అని. ఇంద్రుణ్ణి క్షమించు అనగానే ఆయన ఇలా చేసాడు అలా చేశాడు, ఎందుకు క్షమించాలి అని వాగ్యుద్ధం పెట్టుకోకుండా సరే అని ఎందుకన్నాడు చక్రవర్తి అని ఆలోచిస్తే మనకి తెలిసేది ఏమిటంటే భగదంశతో పుట్టినవారికి క్షమాగుణం అధికం; వారి కోపం తాటిమట్టకి పెట్టిన మంట లాంటిది. ఇలా వచ్చి అలా పోతుంది. పృథు చక్రవర్తి భగవత్స్వరూపుడు అనడానికిదో ఉదాహరణ. ఇదే విషయం మనం భగవద్గీతలో కూడా చూడవచ్చు.

తేజక్షమా ధృతిః శౌచం అద్రోహోనాతిమానితా
భవంతి సంపదం దైవీం అభిజాతస్య భారత [భగవద్గీత, దైవాసుర సంపద్విభాగ యోగం. 16-3]

చ. ఘన మగు దేవ! యీ వరమె కాదు మహాత్మక వాగ్వినిర్గతం
బనఁదగు తావకీన చరణాంబుజ చారు మరందరూపమై
తనరిన కీర్తియున్ విని ముదంబును బొందఁగ లేని మోక్ష మై
నను మదిఁ గోర నొల్ల నఘనాశ! రమేశ! సరోజలోచనా! [4-550]

దీనికి పృధువు అంటున్నాడు – ఈ వరం ఇచ్చినందుకు సంతోషమే కానీ నీ కథలు వినే అవకాశం ఉండాలి; అది లేనప్పుడు ఈ మోక్షం కూడా నాకు అక్కర్లేదనిపిస్తుంది. దీనికంటే మిగతా క్షణికమైన సుఖాలు కోరుకోవడం అనవసరం కదా? అనేకానేకమంది – రామకృష్ణులూ, వివేకానందులూ లాంటి భక్తుల కథలు చదివితే మనకి కూడా ఇదే అర్ధమౌతుంది. వాళ్ళని అమ్మవారు అడిగిందిట – ఏమి కావాలి అని. నువ్వే నాకూడా ఉన్నప్పుడు ఇంక మిగతావి దేనికీ ఇంకేమీ వద్దు అని అడిగారుట. కఠోపనిషత్తులో యమధర్మరాజు అడుగుతాడు నచికేతుణ్ణి రెండు వరాలు ఇచ్చాక మూడోది – ఆత్మ జ్ఞానం ఇమ్మంటే – దానిసంగతి నీకెందుకు మిగతావి ఇస్తాను సంపదలూ అవీ, వాటిని కోరుకో అంటాడు. భగవంతుడు తప్ప మరోటి అక్కర్లేదు కనక నచికేతుడంటాడు – నశించిపోయేవీ నశ్వరం అయిన అవన్నీ నీదగ్గిరే ఉంచుకుని నాకు ఆత్మ జ్ఞానం ఒక్కటీ ఇవ్వు చాలు అని. శివానందులు చెప్పినది ఇదే – ఏది పొందితే ఇంకేమీ పొందక్కర్లేదో ఏది తెలుసుకుంటే ఇంకేమీ తెలుసుకోనక్కర్లేదో అదే బ్రహ్మ జ్ఞానం. అది ఇవ్వండి చాలు, అది రావడానికి మీ కథలు వినడం అదీ ఉంటే చాలు. ఈ పద్యంలో 'నుతులు' అంటే స్తోత్రములు.

చ. అనఘ! మహాత్మ వాగ్గళితమైన భవత్పద పంకజాత సం
జనిత సుధాకణానిలవశంబున విస్మృత తత్త్వ మార్గవ
ర్తను లగు దుష్టయోగులకుఁ గ్రమ్మఱఁ దత్త్వముఁ జూపఁజాలు ని
ట్లొనరుట దక్క నన్య వర మొల్లఁ బయోరుహపత్రలోచనా! [4-552]

ఇంకో విచిత్రమైన కోరిక కోరుతున్నాడు ఇక్కడ పృధువు. నాకు ఆత్మ జ్ఞానం లభించాక దానిని ఒక్కణ్ణీ ఉంచుకోకుండా, తప్పుడు మార్గంలో వర్తించే దుష్ట యోగులకీ, మిగతా వారికీ ఆ దారి చూపించగలిగే వరం అనుగ్రహించు. అలా నీ సేవ చేయడానికి అనుగ్రహించు. ఈ వరంలో ఎంత నిస్వార్ధం ఉందో గమనించారా?

వ. ఇట్లు భవదీయ సేవాతత్పరులమైన యిందిరయు నేను నేక పదార్థాభిలాషం జేసి స్పర్థమానుల మగుచున్న మా యిద్దఱకును బర్యాయసేవం జేసి కలహంబు లేకుండని;మ్మట్లు గాక భవదీయ చరణ సరోరుహ సేవాసక్త మనోవిస్తారుల మగుటం జేసి యేనయేన మున్ను భజియింతు నను తలంపులం గలహం బయిననుం గానిమ్ము దేవా;" యని వెండియు నిట్లనియె. [4-554]

అలా నేను, ఇందిరాదేవీ నీకు సేవచేయడానికి పోటీపడతాము. అలా సేవచేయడంలో మా ఇద్దరికీ కలహం రాకుండా ఉండాలి. పోనీ వచ్చినా సరే అది నాకు సమ్మతమే, అలాగే కానీయండి. ఇలా అడిగే సరికి విష్ణువు సంతోషపడ్డాడు. అటు ఇంద్రుడు కూడా ఎందుకంటే మొదటి విషయంగా ఈయన నూరో యాగం ఆగిపోయింది, లేదా అపగలిగేడు. తర్వాత పృధువు ఇంద్రసింహాసనం కోసం వెంపర్లాడట్లేదని అర్ధం అయింది. ఆయన యజ్ఞం జనప్రయోజనానికి అని తెల్సింది కదా. ఆయనకి యజ్ఞం కన్నా మిగతావారి క్షేమం ముఖ్యం. ఆ నిస్వార్ధత ఎటువంటిదంటే తనకి ఆత్మ జ్ఞానం, మోక్షం ఇస్తే భగవంతుడి గుణగణాలతో నిండిన కళ్యాణాత్మకమైన విష్ణు కథలు వినాలనీ, తనకి మోక్షం వచ్చినా దానిని ఇతరులకి ఇవ్వగలిగే వరం అనుగ్రహించమనీ కదా అడిగాడు. ఇంక ఈయన వల్ల ఇంద్రుడికి కష్టం లేదు. ఆ కోరిక విష్ణువు అనుగ్రహించాడు. భగవంతుడి కరుణ ముందు ఇంద్రపదవి ఏపాటిది? అందుకే రామకృష్ణులు అంటారు, "ఒకచేత్తో భగవంతుణ్ణి పట్టుకుని రెండో చేత్తో మీ పనులు చేస్తూ ఉండండి. పని అవగానే రెండూ చేతులూ భగవంతుడికే జోడించండి," అని. ఇలా అందరికీ సయోధ్య కుదిరింది.

సీ. నర సిద్ధ చారణ సుర ముని గంధర్వ-
కిన్నర పితృ సాధ్య పన్నగులును
నఖిల జనంబులు హరిపార్శ్వవర్తులు
నానంద మగ్నాంగు లగుచు; వేడ్క
యజ్ఞేశ చింతనుం డైన యా పృథువుచే-
సత్కారములఁ బొంది; సమ్మదమునఁ

జనిరి నిజాధివాసములకు; భగవంతుఁ–
డైన నారాయణుం డచ్యుతుండు [4-557]

తే. దగ నుపాధ్యాయ సహితుఁడై తనరు పృథుని
విమలమతు లయి చూచుచు నమరవరులు
దన్ను జయజయ కలిత శబ్దములఁ బొగడఁ
జనియె నప్పుడు వైకుంఠ సదనమునకు. [4-557.1]

ఓ సారి ఇలా సయోధ్య కుదరగానే కూడా అక్కడ ఉన్న నర, సిద్ధ, చారణ, సుర, ముని, గంధర్వ, కిన్నర, పితృ, సాధ్య, పన్నగులును, నఖిల జనంబులు – అంటే జీవకోటిలో దాదాపు అందరూ కూడా, పృథువు చేత అతిధి సత్కారాలు పొంది వెళ్ళారు. నారాయణుడు, చ్యుతి అంటే పతనం లేనివాడి – అచ్యుతుడు, వైకుంఠానికి తిరిగి వెళ్ళాడు.

సీ. సమధికమతిఁ బౌరజన జానపదులచేఁ–
దనరారు వివిధ పూజనము లొంది
రాజు సంతుష్టాంతరంగుండుఁ బ్రియవర–
ప్రదుఁడునై వారల బహువిధములఁ
బూజించె; నివ్విధంబున మహత్తరములై–
నట్టి కర్మంబుల నాచరించు
చును నిరవద్య చేష్టుండై మహత్తముఁ–
డన నొప్పు నా పృథు మనుజవిభుఁడు [4-559]

తే. మించి భూమండలంబుఁ బాలించి విశద
యశము సర్వధరాచక్రమందు నిలిపి
చారు శుభమూర్తి రాజన్యచక్రవర్తి
పరమ మోదమునఁ బరమ పదము నొందె. [4-559.1]

అలా యాగం అయిపోగానే వెనక్కి వచ్చి మంచి చేతలతో (నిరవద్య చేష్టుండై) ధర్మం తప్పకుండా, నిష్కళంకంగా పరిపాలించాడు. తాను పుట్టినప్పుడు ఎండిపోయినట్టూ ఉన్న భూమిని ఉద్ధరించాడు, యశస్సు భూమ్మీద (సర్వధరాచక్రము) నిలిపాక కొంతకాలానికి పరమపదం చేరుకున్నాడు.

ఓ సారి అవలోకనం చేసుకుందాం. దేనికోసం పుట్టాడు పృధువు? భూమి మీద సరైన రాజు లేక, జనం తిండిలేక అల్లల్లాడుతుంటే వాళ్లని ఉద్ధరించడానికి. భూమి నుంచి దున్ని ఔషధాలు తీసాక ఆ పని పూర్తైంది. మిగిలినది పురుషార్ధం. అంటే మానవ జన్మ దేనికైతో కలిగిందో ఆ జన్మని సార్ధకత చేసుకోవడం కోసం. దానికోసం యజ్ఞాలు చేసాడు. భగవంతుడు కనిపిస్తే ఏం కోరుకున్నాడు? నువ్వు, నీ పాదాలకి చేసే సేవ తప్ప ఇంకేమీ వద్దు; నువ్వు మోక్షం ఇస్తే అది మిగతావారికి ఇవ్వగలిగేలా చూడు. ఎందుకంటే నేను పుట్టినదే మిగతావారిని ఉద్ధరించడానికి. ఆ జ్ఞానం ఉంది కనకే పరమ పదం పొందాడు. శివానందులు చెప్పినది సరిగ్గా ఇదే – ఏది పొందితే ఇంకేమీ పొందక్కర్లేదో, ఏది తెలుసుకుంటే ఇంకేమీ తెలుసుకోనక్కర్లేదో అదే బ్రహ్మ జ్ఞానం. ఇదే అన్నమయ్య చెప్పే – పరమయోగులకు పరిపరివిధముల వరమొసగెడు నీ పాదము అనేదానికి అర్ధం.

పృధువు ఎలా రాజ్యం ఏలాడో, విష్ణువు చెప్పినట్టూ ఆయన ఇంటికి సనక, సనందనాదులు వచ్చి ఏమి చెప్పారు, పృధువు తర్వాత రాజ్యం ఏమైందో, ఆయన వంశం సాగి సాగి కొన్ని తరాల తర్వాత పురంజనోపాఖ్యానం ఎలా మొదలౌతుందీ అనేవి వచ్చే వ్యాసం నుండీ చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS